క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్ సేవల్లో 56 మందికి వైద్య పరీక్షలు

రాజుపాలెం: మండలంలోని మొక్కపాడులో బుధవారం ఫ్యామిలీ వైద్య సేవలు అందించారు. డాక్టర్ వెంకట కృష్ణకుమార్ 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 19మందికి షుగర్, 23 మందికి బీపీ పరీక్షలు నిర్వహించి 15 రోజులకు సరిపడా మందుల్ని అందించారు. ఇంటికే పరిమితమైన రోగుల దగ్గరకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, మందుల్ని అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జీవనరావు, ఉదయలక్ష్మి, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మ తిరునాళ్ల

క్రోసూరు: స్థానిక కొండ కింద బజారులో గల అంకమ్మ తల్లి 41వ తిరునాళ్ల మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. భక్తులు అశేషంగా పాల్గొని అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మతోన్మాద బీజేపీని సాగనంపాలి: సీపీఐ

అచ్చంపేట: మతోన్మాద బీజేపీని సాగనంపాలని పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యవర్గ సభ్యుడు పున్నా కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. అచ్చంపేటలో బుధవారం జరిగిన ప్రజాభేరి ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామస్తులకు కరపత్రాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల్ని అవలంబిస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని చెప్పారు. ప్రచారభేరి ఈనెలాఖరు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

సత్తెనపల్లి: భరతమాత అన్నప్రసాద వితరణ పథకంలో భాగంగా పట్టణంలోని గీతా మందిరం వద్ద ఆర్యవైశ్య ఆఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన మద్ది వెంకట సూర్య ఆంజనేయులు పుణ్య తిథి సందర్భంగా వీరి కుమారులు ప్రసాద్, పవన్ కుమార్ ఆర్థిక సాయంతో పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా దివ్వెల శ్రీనివాసరావు దాతలకు, గీతా మందిరం కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కూలర్ బహూకరణ

సత్తెనపల్లి: మండలంలోని భట్లూరు అంగన్‌వాడీ కేంద్రానికి లీడ్ బ్యాంక్ గుంటూరు జిల్లా మేనేజర్ ఈదర రాంబాబు, దివ్యలు బుధవారం కూలర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈదర రామారావు, సచివాలయ సెక్రటరీ కృష్ణప్రసాద్, ఈదర మల్లికార్జునరావు పాల్గొన్నారు.


బాటసారులకు మజ్జిగ పంపిణీ

సత్తెనపల్లి: ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని వాసవీ సేవా సమితి అధ్యక్షుడు వెలుగూరు శరత్‌బాబు, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం మాజీ అధ్యక్షుడు కొత్త లక్ష్మయ్య, ఆవోప పట్టణ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యుల సేవల్ని అభినందించారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ మాట్లాడుతూ కొల్లిపర భాస్కర్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆర్య వైశ్య యువజన సంఘం సభ్యులు దేవరపల్లి కాశీ విశ్వనాథం, తేజ, భవిరిశెట్టి హరి కృష్ణ, చెక్కా రవికుమార్ సహకారంతో ప్రతి రోజు మజ్జిగ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు జవ్వాజి రామ్మోహన్‌రావు, స్వామి ప్రసాదు, చిలకల వాసు, కాకర్ల రమేష్, చారి, దేవరపల్లి రాఘవ పాల్గొన్నారు.

కన్నుల పండువగా విజయ శంకర యాత్ర

సత్తెనపల్లి: శ్రీ వేద గాయత్రీ పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ కార్యవర్గం నేతృత్వంలో అచ్చంపేట రోడ్డులోని శివాలయం నుంచి బుధవారం విజయ శంకర యాత్ర కన్నుల పండువగా సాగింది. జయ జయ శంకర హర హర శంకర అంటూ వేద మంత్రాలతో గుంటూరు రోడ్డులోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు వెళ్లారు. అక్కడ శంకరుల వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్, అధ్యక్షుడు కలవకొలను సీతారామశాస్త్రి, ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

విద్యావేత్త చంద్రమౌళీరెడ్డి మృతి


చంద్రమౌళీరెడ్డి (ఫైల్)

క్రోసూరు: జై భారత్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు తిప్పిరెడ్డి చంద్రమౌళీరెడ్డి(98) బుధవారం మృతి చెందారు. ఆయన క్రోసూరులో తొలిసారిగా పాఠశాల ఏర్పాటు చేసి ఎందరినో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న ఎందరో పూర్వ విద్యార్థులు, స్నేహితులు, బంధువులు, పలువురు రాజకీయ పార్టీ ప్రముఖులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

బాలికా విద్యకు భరోసా


సత్తెనపల్లిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం

విద్యాలయాల్లో సీట్లు, అందుబాటులో ఉన్న గ్రూప్‌లు

కేజీబీవీ	ఆరో తరగతి	ఇంటర్ సీట్లు	ఇంటర్ గ్రూప్
సత్తెనపల్లి	40	40	బైపీసీ
ముప్పాళ్ళ	40	40	బైపీసీ
రాజుపాలెం	40	40	సీఈసీ
నకరికల్లు	40	40	ఎంపీసీ
క్రోసూరు	40	40	ఎంపీసీ
అచ్చంపేట	40	40	ఎంపీసీ
బెల్లంకొండ	40	40	బైపీసీ

- కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 30 వరకు గడువు
- సత్తెనపల్లి డివిజన్‌లో ఏడు విద్యాలయాలు

సత్తెనపల్లి: పేద బాలికల విద్యకు కస్తూర్బా గాంధీ విద్యాలయాలు భరోసాగా నిలుస్తున్నాయి. వీటిలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న బాలికలు ఆన్‌లైన్ ద్వారా పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. ఆరో తరగతితో పాటు ఏడు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని సత్తెనపల్లి, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ, మండలాల్లో విద్యాలయాలు ఉన్నాయి. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 40 సీట్లు చొప్పున ఉంటాయి. 10వ తరగతి పూర్తి చేసిన బాలికలు అక్కడే ఇంటర్ పూర్తి చేసేందుకు అవకాశం ఉంది. గురుకులాల తరహాలో బాలికలకు ఒకే చోట పాఠశాలతో పాటు వసతి సౌకర్యం కల్పిస్తారు. అనాథలు, డ్రాపౌట్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద కుటుంబాలకు చెందిన బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

ఇవి ప్రత్యేకతలు

పాఠశాలల్లో బోధన ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. కుట్లు, అల్లికలు వంటి వాటిల్లో కూడా శిక్షణ ఇస్తారు. ఆత్మస్థైర్యం కోసం కరాటే, యోగా, కంప్యూటర్ కోర్సులు అందుబాటులో ఉంటాయి. వసతి గృహం కూడా అక్కడే ఉండడంతో బాలికలు పాఠశాలల్లోనే ఉండి చదువుకోవాలి.

క్రమశిక్షణతో విద్య

కేజీబీవీలో క్రమశిక్షణతో ప్రభుత్వం విద్యను అందిస్తోంది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయినులతో బోధన ఉంటుంది. చదువుతోపాటు క్రీడలు, ఇతర అంశాల్లో ప్రోత్సహిస్తున్నాం. ప్రశాంత వాతావరణంలో పూర్తి రక్షణతో విద్యాభ్యాసాన్ని కొనసాగించవచ్చు

– ఎం.ప్రసన్న రాణి, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి, సత్తెనపల్లి

గతంలో ఇంతకన్నా మంచి జరిగిందా ?

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


150వ రోజు కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: గత నాలుగేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేశాం.. పెన్షనర్లకు ప్రభుత్వోద్యోగులు కన్నా ముందుగా ఫస్ట్ తారీఖునే తలుపుకొట్టి పెన్షన్ అందజేస్తున్నాం.. గ్రామంలో అంతర్గత రోడ్లు వేశాం.. పాఠశాలను తీర్చిదిద్దాం.. సచివాలయాలు స్థాపించాం... హెల్త్ క్లినిక్‌లను నెలకొల్పాం.. గత ప్రభుత్వాల కాలంలో ఇంతకన్నా మంచి జరిగిందా ? అని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గ్రామస్తులను ప్రశ్నించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోనూరులో బుధవారం రాత్రి ఆయన ఇంటింటికీ వెళ్లి అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాల్ని వివరించారు. ఏ ఇంటికి ఎంత లబ్ధి చేకూరిందో తెలియజేశారు. ప్రభుత్వ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించి 150 రోజులు పూర్తయిన సందర్భంగా దివంగత వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. 150 రోజుల కేక్ కట్ చేసి గ్రామస్తులకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. 30సంవత్సరాల గతాన్ని తిరగేస్తే గత నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి జరగలేదని తెలిపారు. గ్రామంలో రూ.12కోట్ల మేరకు సంక్షేమ పథకాల్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశామని చెప్పారు. రూ.3కోట్లతో సచివాలయాలు నిర్మించామని, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దామని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో అంతర్గత రహదారులు వేసి, సైడు కాలువలు నిర్మించామని తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇంతకన్నా సంక్షేమం, అభివృద్ధి పనులు గతంలో ఎప్పుడైనా జరిగాయా? అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మంచి చేసే వారికి మరోసారి అవకాశం ఇవ్వాలని, సంక్షేమ పథకాలు తిరిగి జగన్‌మోహనరెడ్డి ముఖ్యమంత్రి అయితేనే కొనసాగుతాయని చెప్పారు. చంద్రబాబు కల్లబొల్లి కబుర్లు, అబద్ధపు హామీలు నమ్మొద్దని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, సర్పంచ్ ఏకుల నీలాంబరం, ఎంపీటీసీ సభ్యుడు యంప్రపల్లి నటరాజు, పార్టీ గ్రామ కన్వీనర్ పొగెళ్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, మత్సా శ్రీనివాసరావు, పసుపులేటి జనార్దన్, గుడేటి శ్యాంసన్, మరియదాసు, సొసైటీ మాజీ చైర్మన్ రామిశెట్టి చిన్న యల్లమందయ్య పాల్గొన్నారు.

నేడూ కొనసాగనున్న గడప గడపకు కార్యక్రమం

కోనూరులో గడప గడపకు మన ప్రభుత్వం మూడు రోజు కార్యక్రమం గురువారం కూడా కొనసాగుతుందని పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య తెలిపారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో పర్యటించి సంక్షేమాభివృద్ధిని వివరిస్తారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

మతి భ్రమించి మాట్లాడుతున్న చంద్రబాబు

ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న ఎంపీపీ, పార్టీ నాయకులు

బెల్లంకొండ: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకి వయోభారంతో మతిభ్రమించి ఇష్టానుసారంగా మాట్లాతున్నారని బెల్లంకొండ ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి విమర్శించారు. మంగళవారం అమరావతి మండలంలో చంద్రబాబు పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రభుత్వంపై, స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై చేసిన వ్యాఖ్యల్ని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాయకులతో కలసి ఖండించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమం మరిచి, ధనార్జనే ధ్యేయంగా రాష్ట్రంలో చంద్రబాబు పాలన సాగించారని ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలనతో పేద ప్రజలకు భరోసా కల్పిస్తూ పాలన చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో నిత్యం ప్రజల్లో ఉంటూ ఒక్క రూపాయి అవినీతికి పాల్పడకుండా, మచ్చలేని ఎమ్మెల్యేగా నంబూరు శంకరరావు పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఇసుక తవ్వకాలలో అక్రమాలు చేస్తూ కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడుతున్నారని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దొంగే... దొంగ దొంగ అన్నట్లు ఉన్నాయని తెలిపారు. తెలుగుదేశంలో హయాంలో ఏ విధంగా ఇసుక అక్రమ తవ్వకాలు చేశారో నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. వారి అక్రమ తవ్వకాలకు నదిలో పడి చనిపోయిన 28 మంది చిన్నారులే సాక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించి ఇసుక తవ్వకాలను చేపడుతుంటే, స్థానిక ఎమ్మెల్యే ఇసుక తవ్వకాల ద్వారా నెలకు రూ.20 కోట్లు సంపాదిస్తున్నారని అనడం హాస్యాస్పదంగా ఉందని ఖండించారు. బెల్లంకొండ మండలంలో చంద్రాజుపాలెం, కండిపాడు, మాచాయపాలెం గ్రామాల్లో జగనన్న కాలనీల కోసం 50 ఎకరాలలో ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వానికి ఇచ్చి కోట్ల రూపాయలు ఆర్జించారని చంద్రబాబుతో అబద్ధాలు చెప్పించడం సిగ్గుచేటని తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గంలో గత పదేళ్లలో మాజీ ఎమ్మెల్యే చేయలేని అభివృద్ధి కార్యక్రమాల్ని ఈ నాలుగేళ్లలో ఎమ్మెల్యే శంకరరావు చేసి చూపించారని వివరించారు. చంద్రబాబు, టీడీపీ నాయకులకు ప్రజలు మళ్లీ బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, బూటకపు ప్రేలాపల్ని మానుకోకపోతే చూస్తే ఊరుకునేది లేదని మండల నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బూదాటి మరియదాసు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు చింతారెడ్డి సాయిరెడ్డి, మర్రి ప్రసాద రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, తురకా ఏడుకొండలు, కో–ఆప్షన్ మెంబర్ దరియా, ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి శ్రీను, గాదె మిల్లు వెంకటరెడ్డి, సర్పంచులు నరసింహానాయక్, రమణారెడ్డి, శేషిరెడ్డి, సైదయ్య, లక్ష్మీనారాయణ, బ్రహ్మం, వెంకటస్వామి, శేషిరెడ్డి, కంభంపాటి పాప, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, మర్రి శ్రీనివాసరెడ్డి, నాయకులు మేకల వెంకటేశ్వర్లు, బడా బచ్చ, సుబ్బయ్య పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని దోచుకున్న టీడీపీ నేతలు

వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గాన్ని నిలువునా దోచుకున్న మాజీ శాసనసభ్యుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఆయన అధినాయకుడు చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావును విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ నేతలు ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ నేతలు బుధవారం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధ్యక్షుడుఉ చంద్రబాబునాయుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ రాసి ఇచ్చిన పేపర్ చదువుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అవినీతికి పాల్పతున్నట్లు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేను పట్టుకుని వంకరరావు అంటూ వయస్సు మరచి మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయల సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో పాటు నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి, అమరావతి నుంచి బెల్లంకొండ డబుల్ రోడ్డు, పాలిటెక్నిక్ కళాశాల భవనం, మాదిపాడు నుంచి కృష్ణా నదిపై బ్రిడ్జి నిర్మాణం కళ్లకు కనిపించలేదా ? అన్ని ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పుకుని బతికే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కు వచ్చే ఎన్నికల్లో కూడా ప్రజలు అడ్రస్ లేకుండా చేస్తారని చెప్పారు. సమావేశంలో ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ సభ్యుడు షేక్ జమీలా గఫూర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లేళ్ల వెంకట్రావు, పాశం శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, మర్రి శ్రీనివాసరెడ్డి, సయ్యద్ అబ్దుల్ రహీం, షేక్ ఖాదర్, కొఠారు వెంకట్రావు, వెంకయ్య, దాసయ్య, కృష్ణారెడ్డి, గంజి నబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో సత్తెనపల్లి విద్యార్థుల ప్రతిభ


షేక్ రీనా


నీలోఫర్


గాయత్రి


నాగలక్ష్మి


మనీషా

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని వివిధ ప్రైవేటు కళాశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో షేక్ రీనా 463, షేక్ మొహమ్మద్ ప్యారిజాన్ 456, ఎస్. మణికంఠ 450, బైపీసీ విభాగంలో షేక్ రేష్మ 415, జి.కావ్య 412, సీఈసీ విభాగంలో వై.వసంత కోకిల 404 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ కావూరు శ్రీనివాసరావు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో పఠాన్ నీలోఫర్ 983, మునగా భావన 977, ఎస్. నిరీక్షణ 972 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో చావా సిరి 942, పి. శృతి శరణ్య 938, ఆర్. జ్యోతికాంజలి దేవి 927, సీఈసీ విభాగంలో వి.దేవిశ్రీ లక్ష్మీ జాహ్నవి 917, షేక్ షైలాబాను 914 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో షేక్ రీనా 463, సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో పఠాన్ నీలోఫర్ 983 మార్కులతో పట్టణంలో ప్రథములుగా నిలిచారని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థుల్ని కళాశాల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు అభినందించారు.

- పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ ఇంగ్లిష్ మీడియంలో షేక్ సాదియా భాను 450, షేక్ సమీరా కౌసర్ 445, షేక్ కరీముల్లాకు 441 మార్కులు వచ్చినట్లు ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగం ఫలితాల్లో టి.ఎల్.వి.గాయత్రీ 974, బి.నాగలక్ష్మి 971, కె.మనీషా 970 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థుల్ని కళాశాల సెక్రటరీ డాక్టర్ వెలుగూరి సుబ్బరాయుడు, అధ్యాపకులు అభినందించారు.

బడ్డీ కొట్టులో అగ్ని ప్రమాదం

నకరికల్లు: ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి బడ్డీ కొట్టు సహా సామగ్రి దగ్ధమైన ఘటన మండలంలోని చేజర్ల గ్రామ సమీపంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన ఆవుల శివమ్మ గ్రామ శివారులోని ఒంగోలు బ్రాంచ్ కెనాల్ వద్ద బడ్డీ కొట్టు పెట్టుకుని చిరు వ్యాపారం చేసుకుంటోంది. బజ్జీలు తదితర వంటకాలు చేసేందుకు స్టౌ వెలిగించి వంట చేస్తుండగా సిలిండర్ రెగ్యులేటర్ వద్ద మంటలు చెలరేగాయి. ప్రమాదంలో సామగ్రి సహా బడ్డీ కొట్టు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో రూ50వేలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయింది.

నేడు పీఏసీయస్ చైర్మన్‌గా రంగయ్య ప్రమాణ స్వీకారం

అచ్చంపేట: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్‌గా అచ్చంపేటకు చెందిన రామిశెట్టి రంగయ్య, డైరెక్టర్లుగా సాతర్ల శ్రీనివాసరావు, తుమ్మాలూర్డు మర్రెడ్డి బుధవారం సాయంత్రం 4గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా జరిగే సభలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సంఘ సభ్యులు, రైతులు హాజరుకావాలని రంగయ్య కోరారు.

వైఎస్సార్ సీపీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు

మంత్రి అంబటి రాంబాబు


జయపాల్‌ను సత్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, సముచిత స్థానం లభిస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన ధూళిపాళ్ల గ్రామానికి చెందిన చిలుకా జయపాల్ బుధవారం మంత్రిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జయపాల్‌ను అభినందిస్తూ మరింత ఉన్నత స్థితికి ఎదగాలని ఆశీర్వదించారు. దళిత సామాజిక వర్గాల నాయకుల్ని కలుపు కొని పార్టీకి మేలు జరిగేలా చూడాలని చెప్పారు. జయపాల్ మాట్లాడుతూ సమష్టి కృషితో పార్టీ కార్యక్రమాల్ని బలోపేతం చేసేందుకు, ఎస్సీల్ని చైతన్యం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం జయపాల్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం కన్వీనర్ అచ్యుత శివప్రసాద్, ధూళిపాళ్ల ఆంధ్రాబ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివన్నారాయణ, నకరికల్లు, రాజుపాలెం, ముప్పాళ్ల, పట్టణ, రూరల్ మండలాల జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు మేడం ప్రవీణ్‌రెడ్డి, పులిబండ్ల అశోక్, బొంత వెంకటరెడ్డి, కొణతం స్వాతి, నాయకులు వల్లెం నరసింహారావు, రేపూడి రవితేజ, తలతల భాస్కర రెడ్డి, భట్లూరు కోటేశ్వరరావు, పలు గ్రామాల దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్‌కు పరామర్శ

వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బత్తుల రామస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గుంటూరులో చికిత్స పొందుతున్నారు. మంత్రి అంబటి రాంబాబు బుధవారం గుంటూరు ఆదిత్య వైద్యశాలలో చికిత్స పొందుతున్న రామస్వామిని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, నాయకులు ఉన్నారు.

'నాడు-నేడు'లో చేపట్టిన పనులే అభివృద్ధికి నిదర్శనం



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

ముప్పాళ్ల: గ్రామాల్లో నాడు–నేడు ద్వారా పాఠశాలల పునర్నిర్మాణం, ఆసుపత్రుల్లో అధునిక వసతులు, ప్రభుత్వ కార్యకలాపాలకు సొంత భవనాల నిర్మాణమే అభివృద్ధికి నిదర్శనమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్ స్థాయికి మార్చి, అందరికీ మెరుగైన విద్య అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. ఇది అభివృద్ధిలో భాగమేనని, గ్రామ స్థాయిలో నిర్మించిన భవనాలే అందుకు సాక్ష్యాలని తెలిపారు. మండలంలో ఫేజ్–2 కింద మొత్తం రూ.193లక్షలతో పాఠశాలల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి పనుల్ని స్థానిక ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేసి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. దీని ద్వారా గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని చెప్పారు. బొల్లవరం ఎంపీటీసీ సభ్యుడు కళ్లం వీరభాస్కరరెడ్డి మాట్లాడుతూ బొల్లవరం–రుద్రవరం గ్రామాల్ని అనుసంధానం చేస్తూ రహదారి నిర్మాణం చేపట్టాలని మంత్రి దృష్టికి తెచ్చారు. అంచనాలు తయారు చేయాలని ఆయన ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. ముందుగా అధికారులు తమ శాఖల పనితీరును వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మారూరి పద్మ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరిగిరి చంద్రకళ, తహసీల్దార్ ఎం.భవానీశంకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కళ్లం శివరామిరెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న విజయ భాస్కరరెడ్డి తదితరులు

సత్తెనపల్లి: మండలంలోని బృగుబండ నుంచి పాకాలపాడు వెళ్లే మార్గంలో వర్షం పడితే లోలెవల్ చప్టా పైనుంచి నీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. రెండు గ్రామాల ప్రజలు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఎప్పటి నుంచో కోరుతున్నప్పటికీ గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. నేడు హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణానికి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు రూ.40 లక్షలు మంజూరు చేయించారు. బుధవారం హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణానికి వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయ భాస్కర్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అన్నదాసు శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ గండు పద్మావతి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు అన్నదాసు రాఘవరావు, ఇనుకొల్లు దేశీ బాబు,రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

లో లెవల్ చప్టా నిర్మాణానికి నిధుల మంజూరు

తొండపి(ముప్పాళ్ల): మండలంలోని తొండపి నుంచి రాజుపాలెం మండలం గణపవరం రహదారిలోని ఎద్దువాగుపై నిర్మించనున్న లోలెవల్ చప్టా నిర్మాణానికి గాను ఎంపీ లాడ్స్ నిధులు రూ.20లక్షలు మంజూరైనట్లు తొండపి గ్రామ సర్పంచ్ గోవిందు యలమందమ్మ బుధవారం తెలిపారు. పనులకు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు నిధులు మంజూరు చేశారని చెప్పారు. చప్టా నిర్మాణం వల్ల రెండు మండలాల మధ్య ప్రయాణానికి, రైతులు వ్యవసాయ పనులకు గాను ఎంతో ఉపయోగంగా ఉంటుందని పేర్కొన్నారు. నిధులు కేటాయించిన ఎంపీకి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోరుపోతు కోటయ్య, ఎంపీటీసీ సభ్యుడు బందెల జాన్‌సైదా, షేక్ అబ్దుల్ రషీద్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.జె.ఎం.రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, శిరిగిరి గోపాలరావు పాల్గొన్నారు.

పథకాల అమలులో దేశంలోనే ఆదర్శం



నకరికల్లు: ప్రభుత్వ పథకాల అమలులో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశ చరిత్రలో ఆదర్శనీయంగా నిలిచిందని మండల జేసీఎస్ ఇన్‌చార్జి మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు, జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నేతలు ఇంటింటికీ వెళ్లి అందుతున్న సంక్షేమ పథకాలు ఆరా తీశారు. ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ప్రవీణకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు 90శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. నకరికల్లులో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బీ బాషా, ఎంపీటీసీ సభ్యుడు షేక్ హుస్సేన్‌బీ సలీల్, సొసైటీ మాజీ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, పరసా సాంబయ్య, మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యుడు జూలకంటి సతీష్, ఆయా గ్రామాల వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.